సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..
# మన చౌరాస్తా
The Complete News way
మన చౌరాస్తా Telugu News Channel
సంపుటి : 02 | సంచిక : 31 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | మంగళవారం | 13.05.2025





3 లో

## 'అభివృద్ధిని చూసైనా వారికి బుద్ధి రావాలి'

# ఇచ్చిన మాట తప్పం

### పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

### పంచాయతీరాజ్ శాఖ మంత్రి మంత్రి సీతక్క

**ములుగు, మన చౌరాస్తా :** రాష్ట్రంలోని ప్రజా పాలన ప్రభుత్వం ప్రతి పనిని చిత్తశుద్ధితో పూర్తి చేయడమే కాకుండా ఇచ్చిన మాట కట్టుబడి ప్రతి పనిని పూర్తి చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. తాను ములుగు నియోజకవర్గం లోని ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ దశలవారీగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నానని స్పష్టం చేశారు. సోమవారం మంగపేట మండలం నర్సింహసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని శనగకుంట గ్రామంలో అగ్నిమాపక బాధితులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ గత సంవత్సరం జరిగిన అగ్ని ప్రమాదంలో శనిగకుంటలోని కొన్ని కుటుంబాల వారు సర్వస్వం కోల్పోగా ఆ క్షణమే కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబాలకు వంట సామాన్లతో పాటు బట్టలను అందజేయడం జరిగిందని, 300 స్వచ్ఛంద సంస్థలతో బాధిత కుటుంబాలకు సహాయం అందించడం జరిగిందని వివరించారు. అగ్నిమాపక బాధితులు ధైర్యం కోల్పోకుండా ఆత్మవిశ్వాసం కల్పించడానికి ప్రత్యేక సహాయ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ఐటిడిఏ ద్వారా ఆర్థిక సాయం అందజేయడం జరిగిందని తెలిపారు. గ్రామంలో ముఖ్యంగా మంచినీటి యద్దడిని నివారించడానికి సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో నేడు ప్రతి ఇంటి ఇంటికి నల్లాల ద్వారా మంచినీటిని అందించడం జరుగుతుందని, గతంలో తాను ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి భూమి పూజ చేయడం సంతోషం కలిగిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుత వేసవి కాలంలో జిల్లాలో ఎక్కడ మంచి నీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని చర్యలు తీసుకుంటున్నామని, పరిపాలన కేంద్రంగా ఉంటున్న ఐటీడీఏలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయించడమే కాకుండా అదనంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశారని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాని పేదలు ఎవరు ఆందోళన చెందవద్దని రెండవ దఫా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తున్న లబ్ధిదారులకు త్వరతగతిన బిల్లులు చెల్లించడానికి కలెక్టర్ చర్యలుతీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ మాట్లాడుతూ శనిగకుంట గ్రామంలో నీటి సమస్య ఉన్న కారణంగా గ్రామస్తులు నీటిని నిలువ చేసుకొని సేవించడం వలన అనేక వ్యాధుల బారిన పడ్డారని, మంత్రి ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో మంచినీటి సమస్యను తీర్చామని అన్నారు. ప్రభుత్వం, మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ప్రతి పనిని చిత్తశుద్ధితో పూర్తి చేయడానికి చొరవ చూపుతున్నామని, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విషయంలో మధ్యవర్తులకు ఏమాత్రం అవకాశం కల్పించడం లేదని స్పష్టం చేశారు. వరద ముప్పు, అగ్ని ప్రమాద బాధితులకు అన్ని విధాలుగా సాయం చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ చీమలపాటి మహేందర్ జీ, మంగపేట తహసీల్దార్ తోట రవీందర్, ఎంపీడీఓ బి. భద్రు, ఇంచార్జ్ ఎంపీఓ కే.కిషోర్ కుమార్, నర్సింహసాగర్, కార్యదర్శి రూప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

wanted

విలేకరులు కావలెను



మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..
మన చౌరాస్తా
The Complete News way

General News



## ప్రజావాణి వినతులపైన ప్రత్యేక దృష్టి పెట్టాలి

- పథకాల అమలును నిరంతర పర్యవేక్షించాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్‌తో కలిసి కలెక్టర్ వినతులను స్వీకరించారు. ఆ వినతులను సంబంధిత శాఖ అధికారులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. తమ వినతులకు తప్పకుండ పరిష్కారం లభిస్తుందనే నమ్మకాన్ని అధికారులు ప్రజలకు కలిగించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం వివిధ శాఖలకు చెందిన అధికారులతో అలాగే జూమ్ మీటింగ్ ద్వారా తహసీల్దార్లతో కలెక్టర్ పలు అంశాల మీద రివ్యూ చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబందించిన క్షేత్ర స్థాయి వెరిఫికేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి అయ్యేలా చుడాలని, అలాగే ఇప్పటివరకు వెరిఫికేషన్ పూర్తి చేసిన వాటిని ఆన్‌లైన్‌లో త్వరగా నమోదు అయ్యేలా మానిటరింగ్ చేయాలన్నారు. రాజీవ్ యువ వికాస పథకానికి అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా జరుగుతున్న సిబిల్ స్కోర్ వెరిఫికేషన్‌ను పూర్తి చేసి ఫైనల్ లిస్ట్‌ను సంక్షేమ శాఖ అధికారులు త్వరగా సమర్పించాలన్నారు. ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు చెల్లింపుల్లో జనగామ జిల్లా మొదటి స్థానంలో ఉందని, ఇదే స్థానం కొనసాగాలి అంటే మరో 15 రోజులు నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. అలాగే వేసవి కాలం ముగిసే వరకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబందించి త్వరగా పనులను ఫైనల్ చేయాలని, పేమెంట్ అయిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు వెంటనే ప్రొసీడింగ్ ఇవ్వాలన్నారు. జిల్లాలోని వివిధ పాఠశాలలో వేసవి శిక్షణ తరగతులు జరుగుతున్నాయని, మండల స్పెషల్ అధికారులు ఆ క్యాంపులను సందర్శించి విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు ఇక కలెక్టరేట్ లో ప్రతీ ఫ్లోర్ లో సానిటేషన్ నిర్వహణ పక్కాగా ఉండాలని, సిబ్బంది సమయానికి అటెండెన్స్ కరెక్ట్‌గా ఉండేలా అన్ని శాఖల అధికారులు చూసుకోవాలని, ఆకస్మిక తనిఖీలు మళ్లీ ఉంటాయని, ఆ సమయంలో ఎలాంటి తేడా అయిన గమనిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీఓ, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.





## వేగవంతంగా కొనుగోలు ప్రక్రియ

### అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్

**స్టేషన్‌ఘన్‌పూర్/పాలకుర్తి, మన చౌరాస్తా :** ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరగాలని అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ అన్నారు. సోమవారం చిల్పూర్ మండలంలోని పల్లగుట్ట, క్రిష్టాజీ గూడెం, చిల్పూర్ అలాగే పాలకుర్తి మండలం లోని గూడూరు లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర నిర్వాహకులకు పలు ఆదేశాలిచ్చారు. ముందుగా ఇప్పటి వరకు జరిగిన ధాన్యం కొనుగోలుకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. కొనుగోలులో ఎలాంటి ఆలస్యం జరగకూడదని, వెంటనే ట్యాగ్ చేసిన మిల్లులకు ధాన్యం తరలించాలని.. గన్ని బ్యాగ్ లలో, రవాణాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, సివిల్ సప్లై, మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులు స్పీడప్ చేయాలి

### అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్

**జనగామ, మన చౌరాస్తా :** మున్సిపల్ పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ ఆదేశించారు. బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను, సబ్ రిజిస్టర్ కార్యాలయం దగ్గరలో నిర్మాణంలో ఉన్న లేబర్ ఆఫీస్, చీటకోడూరులో జరుగుతున్న ఇంట్రా పైప్లైన్ పనులను సోమవారం అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ అభివృద్ధి పనులన్నీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఈ రాజ్ కుమార్, ఏఈ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## భూమాత రైతు సంక్షేమ సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా భగవాన్ రెడ్డి



**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** భూమాత రైతు సంక్షేమ సంఘం జనగామ జిల్లా సహాయ కార్యదర్శిగా భగవాన్ రెడ్డి చిల్పూరు మండలంలోని పల్లగుట్ట గ్రామానికి చెందిన వంచ భగవాన్ రెడ్డిని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ సమ్మయ్య యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా భగవాన్ రెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకంతో బాధ్యతను అప్పగించిన పెద్దల నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్ర, జిల్లా శాఖ కమిటీల పిలుపు మేరకు స్పందించి ప్రజల పక్షాన పోరాడుతానని అన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు సమ్మయ్య యాదవ్, జిల్లా అధ్యక్షుడు చెవుల యాదగిరి, జిల్లా కోశాధికారి పద్మారెడ్డి, సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్టీసీ బస్సులో చోరీ

- మహిళ బ్యాగ్ లోంచి 13.5 తులాలు మాయం
- జనగామ నుంచి హనుమకొండకు వస్తుండగా ఘటన

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** బస్సులో ప్రయాణిస్తున్న మహిళ బ్యాగులోంచి 13.5 తులాల బంగారాన్ని దొంగలు అపహరించారు. ఈ ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలో చోటుచేసుకుంది. చిత్తలూరి మమత వృత్తిరీత్యా ప్రైవేటు టీచర్ ఆయన ఈమె తూప్రాన్ లో నివాసం ఉంటున్నారు. మంగళవారం తన ఆడపడుచు ఇంట్లో ఎల్లమ్మ పండగ ఉండడంతో హనుమకొండలో తన తల్లి గారింటి వద్ద ఉన్న పిల్లలను తీసుకుని వెళ్లడానికి ఉదయాన్నే బయలు దేరింది. తన కున్న ఆభరణాలను బ్యాగ్ లో వేసుకొని వచ్చింది. జనగామలో బస్సు ఎక్కి హనుమకొండ వైపు వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు బ్యాగ్‌లో ఉన్న సుమారు 13.5 తులాల బంగారు ఆభరణాల సంచిని దొంగిలించారు. రఘునాథపల్లి స్టేజి వద్ద బస్ ఆగినప్పుడు చూసుకొని ఆభరణాలు లేకపోవడంతో బోరున విలపించింది. బస్సులో ఉన్న డ్రైవర్ కండక్టర్లకు సమాచారం అందించడంతో.. వారు బస్సును రఘునాథపల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా నిలిపివేశారు. అక్కడికి చేరుకున్న పోలీసుల బృందం అందరినీ తనిఖీలు చేపట్టారు. రఘునాథపల్లి గ్రామపంచాయతీ, పలు చోట్ల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరంచేస్తున్నట్లు ఎస్ఐ డి .నరేష్ తెలిపారు.



# అభివృద్ధిని చూసైనా బుద్ధి రావాలి

## ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** రూ.800 కోట్లు కాదు 8 పైసలు కూడా తేలేదు అంటున్న వారు నియోజకవర్గ కేంద్రంలో నిర్మాణం అవుతున్న 100 పడకల ఆసుపత్రి, బంజారా భవన్, ఇంటిగ్రేటెడ్ రెవిన్యూ డివిజనల్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణాలు చూసి బుద్ధి తెచ్చుకోవాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్మాణం అవుతున్న బంజారా భవన్, 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించి శంకుస్థాపన శిలాఫలకాలను ఎమ్మెల్యే కడియం సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గిరిజన తండాలకు 77 కోట్లతో పక్కా రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. దాదాపు 20 తండాలకు 38 కిలోమీటర్ల మేర బీటీ వేయించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో సుమారు 17 వేల ఓట్ల జనాభా ఉన్న గిరిజనులకు నియోజకవర్గ కేంద్రంలో బంజారా భవన్ ఉండాలని 2 కోట్లతో బంజారా భవన్ నిర్మాణానికి మంజూరు తీసుకువచ్చానని వెల్లడించారు. నియోజకవర్గంలో నూతన గ్రామపంచాయతీలు అయిన 8 గిరిజన తండాలకు 1కోటి 60 లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలో 63 లక్షలతో ఎస్టీ హాస్టల్ భవన నిర్మాణ పనులు చేసుకున్నామని త్వరలోనే ప్రారంభించుకొనున్నట్లు తెలిపారు. బంజారా భవన్ వద్ద లేవలింగ్, డైనింగ్ హాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. తండాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని వివరించారు. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి 70 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు, వాటికీ వీలైనంత త్వరలో నిధుల మంజూరు తీసుకువచ్చి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 26 కోట్లతో డివిజనల్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణం, 100 పడకల ఆసుపత్రి నిర్మాణం డిగ్రీ కాలేజీ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ వంటి పనులు జరుగుతున్నాయని తెలిపారు. అయినప్పటికీ కొంత మంది ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రాజకీయ విమర్శలు చేయడంలో తప్పులేదని అసత్య ప్రచారాలు చేయవద్దని సూచించారు. నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనులను చూసైనా బుద్ది తెచ్చుకోవాలని అన్నారు. ఎవరెన్ని అసత్య ఆరోపణలు చేసిన వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్దే ద్యేయంగా తాను ముందుకు వెళ్తున్నానని, నియోజకవర్గ ప్రజలు తల ఎత్తుకునేలా అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ లావణ్య, వైస్ చైర్మన్ ఐలయ్య, ఆర్డీవో వెంకన్న, తాసిల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో విజయశ్రీ, డాక్టర్లు వీరాంజనేయులు, సంధ్యారాణి నాయకులు సిహెచ్.నరేందర్, బి.వెంకన్న, రాజేష్ నాయక్, స్వామి నాయక్, శిరీష్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, సారంగపాణి, నీల శ్రీధర్, దేవస్థానం చైర్మన్ నీల నర్సింలు, జీడి రమేష్, మంద రాజు, గట్టు ప్రశాంత్, తెల్లాకుల రామకృష్ణ, సింగపురం వెంకటయ్య, డిసిసి ఎల్లయ్య గిరిజన, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# రేణుకుంట్ల మురళికి బెస్ట్ సైకాలజిస్ట్ అవార్డు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణానికి చెందిన ప్రముఖ కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ రేణుకుంట్ల మురళి తెలంగాణ బెస్ట్ సైకాలజిస్ట్ అవార్డు లభించింది. తెలంగాణ స్టేట్ కమిషన్ ఫర్ ఉమెన్ చైర్మన్ నేరెళ్ల శారద, మాజీ జాతీయ మహిళ కమిషన్ సలహాదారు. డాక్టర్ త్రిపురాన వెంకటరత్నం, ప్రొడ్యూసర్ డాక్టర్ పద్మిని నాగులపల్లి, బెస్ట్ ఇన్నొవేటివ్ యునివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నాగలక్ష్మి, తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోత్కూరి రాంచందర్ చేతులమీదుగా హైదరాబాద్‌లో ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ఇటీవల కాలంలో వ్యక్తి గత జీవితంలో, విద్య, ఉద్యోగ రంగాల్లో చోటు చేసుకుంటున్న ఒత్తిడిలు మానసిక ఆరోగ్యంపై ప్రభావితం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ ఒక్కరు మానసిన ఒత్తిడిని తగ్గించుకుని జీవించాలన్నారు.

# అందని ద్రాక్షలా కాంగ్రెస్ పథకాలు

**జనగామ, మన చౌరాస్తా :** కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు పేదలకు అందని ద్రాక్షల అయ్యాయని సీపీఎం జిల్లా నాయకులు ధర్మభిక్షం విమర్శించారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించాలని కోరుతూ సోమవారం ఆయన కలక్టర్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అడవికేశ్వపూర్‌లో ఇందిరమ్మ ఇల్లు అర్హులకు కాకుండా సాగు భూములు ఉన్న వారికి ఇందిరమ్మ కమిటీ సిఫారసు ప్రకారం ఇస్తున్నారని ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ శాఖ సభ్యులు దండు ఎల్లయ్య , బైరగోని హరి, ఆంజనేయులు, దండు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.






# ఇంటి నెంబర్లు ఇవ్వాలి

## సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి

**జనగామ, మన చౌరాస్తా :** వీరనారి ఐలమ్మ నగర్ మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారులు ప్లాట్ కలిగి ఇల్లు కట్టుకొని కబ్జాలో ఉన్న ప్రతి ఒక్కరికి మున్సిపల్ ద్వారా మోటివేషన్ చేసి ఇంటి నెంబర్లు నంబర్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ అధ్యక్షతన జరిగిన మూడో విడత ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారులకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేసి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం2012-13లో ఇందిరమ్మ పట్టా లబ్ధిదారులకు రూ.5 లక్షల రుణం గృహలక్ష్మి ద్వారా ప్రత్యేక అవకాశం కల్పించి కోరారు. లేకపోతే లబ్ధిదారులతో పెద్ద ఎత్తున ఆందోళనలో చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, పట్టణ కమిటీ సభ్యులు బాల్నే వెంకట మల్లయ్య, ఎండి గౌసియా, ఏనుగుల కమల, బండ సౌందర్య, మున్సిపట్ల జయ, ఎర్ర రజిత, పద్మ జ్యోతి, మల్లేష్, కవిత, సుజాత, చింతల శ్రీలత, అంజమ్మ, రజిత, కొన్నే శాంత, కచ్చగళ్ళ వెంకటేష్, మాదాసి సుధాకర్, బాలస్వామి, పాల్వాయి పద్మ, మమత తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా 'గొల్లపల్లి' జన్మదినం

**జనగామ, మన చౌరాస్తా :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కొమురవెల్లి దేవస్థాన మాజీ చైర్మన్ గొల్లపల్లి కుమారస్వామి గౌడ్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా కొమ్మూరి మాట్లాడుతూ కుమారస్వామి 48 ఏళ్లగా కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని, పార్టీకి అనేక సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు, చేర్యాల మండల అధ్యక్షుడు కొమ్ము రవి, మాజీ ఎంపీటీసీ భూక్యా కోట నాయక్ తదితరులు పాల్గొన్నారు.





# నాగార్జునతో ఛాన్స్ మిస్ చేసుకున్న కాజల్

టాలీవుడ్‌లో మంచి గుర్తింపు సంపాదించుకున్న నటీమణులలో కాజల్ అగర్వాల్ ఒకరు. ఇప్పటి వరకు ఎన్నో సినిమాలతో, అద్భుతమైన విజయాలు అందుకున్న ఈ ముద్దుగుమ్మ.. కేవలం తెలుగు సినిమాల్లో మాత్రమే కాకుండా ఇతర భాషలోను దాదాపు అందరు స్టార్ హీరోలతో జతకట్టింది. తన నటన అందంతో ఇండియా వ్యాప్తంగా మంచి క్రేజ్, ఫ్యాన్ ఫాలోయింగ్ దక్కించుకుంది. ఇక పోతే కాజల్ కేవలం హీరోయిన్ పాత్రలు మాత్రమే కాకుండా స్పెషల్ సాంగ్స్ కూడా చేసింది. అయితే తాజాగా ఈ అమ్మడు, నాగార్జునకు సంబంధించిన ఆసక్ఇకర వార్త ఒకటి వైరల్ అవుతుంది.. టాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోలలో ఒకరైనా నాగార్జున ఇంకా కాజల్ కాంబోలో ఇప్పటివరకు ఒక్క సినిమా కూడా రాలేదు. కానీ వీరిద్దరి కాంబోలో రెండు సినిమాలు మిస్ అయినట్లు- తెలుస్తోంది. నాగార్జున నటించిన 'రగడ' అనే మూవీ చూసే ఉంటారు. ఇందులో అనుష్క, ప్రియమణి హీరోయిన్లుగా నటించారు. అయితే మొదట ఈ మూవీలోని ప్రియమణి పాత్రకు కాజల్‌ను అనుకున్నారట. కానీ కొన్ని కారణాల వల్ల ఆమెను కాకుండా ప్రియమణిని తీసుకున్నారట. ఇక నాగార్జున హీరోగా రూపొందిన 'ది ఘోస్ట్' మూవీ లో కూడా మొదట కాజల్‌ను హీరోయిన్ గా అనుకున్నారట. కానీ అది కుదరకపోవడంతో ఆ సినిమాలో సోనాల్ చౌహాన్ ను హీరోయిన్‌గా తీసుకున్నారు. ఇలా రెండు సార్లు నాగార్జున తో నటించే అవకాశాన్ని కాజల్ మిస్ అయినట్లు- తెలుస్తోంది.